క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

కాజీపేట అర్బన్: న్యూశాయంపేటలో శుక్రవారం విద్యుత్ సరఫరా ఉండదని డీఈ సాంబరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు టెంపుల్ ట్రీ విల్లాస్, అల్లూరి కళాశాల ప్రాంతాల్లో విద్యుత్‌కు అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు.

నేడు అయ్యప్పస్వామి కల్యాణం

కాజీపేట: కాజీపేట స్వయంభూ శ్వేతార్క మూలగణపతి దివ్యక్షేత్రంలో శుక్రవారం పూర్ణ పుష్కల సమేత అయ్యప్పస్వామికి కల్యాణం, పడిపూజ నిర్వహించనున్నట్లు ఆలయ వైదిక కార్యక్రమాల నిర్వాహకుడు అయినవోలు రాధాకృష్ణ శర్మ ఒక ప్రకటనలో తెలిపారు.

రేపు రుద్రేశ్వరాలయంలో పూజలు

హన్మకొండ కల్చరల్: శని త్రయోదశిని పురస్కరించుకుని శనివారం రుద్రేశ్వర వేయిస్తంభాల దేవాలయంలో శని పూజలు, నవగ్రహ పూజలు జరుగుతాయని ఆలయ ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ తెలిపారు.

సీఎం కప్ రెఫరీగా కృష్ణమూర్తి



కాజీపేట: హైదరాబాద్ ఎల్‌బీ స్టేడియంలో జరగనున్న సీఎం కప్ పోటీల రెఫరీగా కాజీపేట పట్టణానికి చెందిన మండలోజు కృష్ణమూర్తి ఎంపికయ్యారు. హనుమకొండ జిల్లా వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కొనసాగుతున్న కృష్ణమూర్తిని ప్రభుత్వం రెఫరీగా ఎంపిక చేయడంపై ఎవర్‌గ్రీన్ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు గురువారం హర్షం వ్యక్తం చేస్తూ ఆయనను సన్మానించారు.

ఏబీవీపీ రాష్ట్ర సభ్యుడిగా సుజిత్



విద్యారణ్యపురి: అఖిల భారత విద్యార్థి తెలంగాణ రాష్ట్ర కార్యసమితి సభ్యుడిగా హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి ఆరెపల్లి సుజిత్ ఎన్నికయ్యారు. సిద్దిపేటలో నిర్వహించిన ఏబీవీపీ రాష్ట్ర మహాసభలో ఎన్నుకున్నట్లు సుజిత్ గురువారం తెలిపారు.

ద్రవిడ పార్టీ డివిజన్ అధ్యక్షుడిగా ప్రణీత్

ఖిలా వరంగల్: తెలంగాణ ద్రవిడ ప్రజల పార్టీ 38వ డివిజన్ అధ్యక్షుడిగా మధ్యకోటకు చెందిన పూసల ప్రణీత్ నియమితులయ్యారు. ప్రణీత్‌కు పార్టీ జిల్లా అధ్యక్షుడు పూసల శ్రీకాంత్ నియామక పత్రం అందజేశారు.

ఇంటింటా ఇందిరమ్మ సర్వే



ఖిలా వరంగల్: ఇందిరమ్మ సర్వేను సద్వినియోగం చేసుకోవాలని 35వ డివిజన్ కార్పొరేటర్ సోమిశెట్టి ప్రవీణ్ అన్నారు. వరంగల్ శివనగర్, ఏసీరెడ్డినగర్‌లో ఇందిరమ్మ సర్వే గురువారం కొనసాగింది. ఈ సందర్భంగా కమిటీ ప్రతినిధులతో కలిసి ఆయన సర్వేను పరిశీలించారు. కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి కొత్తపల్లి శ్రీనివాస్, రేణుకుంట్ల శివకుమార్, శ్రీరాంరాజేష్, రాజు, మాధవి, సరస్వతి, ఇందిరమ్మ, రమేష్ పాల్గొన్నారు.

వేం నరేందర్‌రెడ్డి జన్మదిన వేడుకలు



కాజీపేట రూరల్: సీఎం ముఖ్య సలహాదారు వేం నరేందర్‌రెడ్డి జన్మదిన వేడుకలను కాజీపేట 47వ డివిజన్ డీజిల్ కాలనీ చౌరస్తా వద్ద కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పసునూరి మనోహర్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు.

కాజీపేట అర్బన్: సీఎం ప్రధాన సలహాదారు వేం నరేందర్‌రెడ్డికి రాష్ట్ర కోఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

కాజీపేట: వేం నరేందర్ రెడ్డిని కాజీపేట పట్టణానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు గురువారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

మామునూరు: వేం నరేందర్‌రెడ్డిని మామునూరు మాజీ జెడ్పీటీసీ, కాంగ్రెస్ నేత గంట నరేందర్‌రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

టీజీఓ నాయకుడి జన్మదిన వేడుకలు



హన్మకొండ అర్బన్: తెలంగాణ గెజిటెడ్ అసోసియేషన్ కేంద్ర సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఉమ్మడి వరంగల్ జిల్లా సమన్వయకర్త అన్నమనేని జగన్‌మోహన్‌రావు జన్మదిన వేడుకలను గురువారం ఆయన నివాసంలో వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు ఘనంగా నిర్వహించారు. టీజీఓ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు కారం రవీందర్‌రెడ్డి, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు మురళీధర్‌రెడ్డి, కార్యదర్శి ప్రవీణ్‌కుమార్, రాజేష్‌గౌడ్, ఎంపీడీఓలు ఆంజనేయులు, అనిల్‌కుమార్, ఎంపీఓలు రఘుపతిరెడ్డి, శ్రీనివాస్, సయ్యద్‌హసన్, జనగామ సబ్ రిజిస్ట్రార్ అంజద్ తదితరులు పాల్గొని జగన్‌మోహన్‌రావు దంపతులను గజమాలతో సన్మానించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.

కూరగాయల మార్కెట్‌లో బారికేడ్లు



మార్కెట్ గేట్ -1 వద్ద ఏర్పాటు చేసిన బారికేడ్లు



గేట్ -2 వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్



కమర్షియల్ మడిగెల వైపు గేట్ -4 వద్ద..

- వాహనాలు, పశువుల స్వైర విహారానికి అడ్డుకట్ట

వరంగల్: వరంగల్ లక్ష్మీపురంలోని మోడల్ కూరగాయల మార్కెట్‌లోకి వాహనాలు, పశువులు రాకుండా ప్రధాన ద్వారాల్లోని మూడు ఎంట్రీ గేట్ల వద్ద చెక్‌పోస్టుతో పాటు బారికేడ్లను వరంగల్ మార్కెట్ అధికారులు గురువారం ఏర్పాటు చేశారు. గత కొన్ని నెలలుగా మార్కెట్‌లోకి పశువులు, మోటార్ సైకిళ్లు, డీసీఎం వ్యాన్‌లు, ఆటోలు యథేచ్ఛగా రావడంతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. పలుమార్లు ఈగేట్లకు అడ్డుగా సిమెంటు దిమ్మలు ఏర్పాటు చేసేందుకు అధికారులు ప్రయత్నించగా వ్యాపారులు విముకత వ్యక్తం చేశారు. గేట్లను పూర్తిగా సిమెంటు దిమ్మలతో కట్టడి చేస్తే ఉదయం పూట సరుకులతో వచ్చే వాహనాల డ్రైవర్లకు ఇబ్బందులు ఎదురవుతాయని మార్కెట్ కార్యదర్శి దృష్టికి తీసుకుపోవడంతో మార్కెట్ ప్రధాన ద్వారాల వద్ద గేట్లను ఏర్పాటు చేసేందుకు నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. మార్కెట్‌లోకి వచ్చేందుకు మొత్తం 5గేట్లు ఉండగా ప్రస్తుతం 1, 2, 3, 4 గేట్ల వద్ద చెక్‌పోస్టులతో పాటు బారికేడ్లను ఏర్పాటు చేశారు. సరుకులు వచ్చిన సమయంలో తెల్లవారుజామున గేట్లు ఎత్తి ఉదయం 7గంటలకు మూసివేస్తే లోపలకు వాహనాలు, ఆటోలు, మోటార్ సైకిళ్లు, పశువులు రాకుండా ఉంటాయని అధికారులు భావిస్తున్నారు.

జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉన్నా

- పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



బహుమతులు ప్రదానం చేస్తున్న ఎమ్మెల్యేలు

నయీంనగర్: జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించేందుకు తాను కట్టుబడి ఉన్నానని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన స్పోర్ట్స్ మీట్ -2024 ముగింపు కార్యక్రమం ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి, కాంగ్రెస్ వరంగల్ జిల్లా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రూ.10 లక్షల వ్యయంతో చేపట్టిన క్లబ్ ప్రహరీ నిర్మాణానికి వారు శంకుస్థాపన చేశారు. అనంతరం ఎమ్మెల్యేలు మాట్లాడుతూ జర్నలిస్టుల సహకారంతోనే తాము రాజకీయాల్లో రాణిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి బొల్లారపు సదయ్య, కోశాధికారి బోల్ల అమర్, జర్నలిస్ట్ సంఘాల నాయకులు, జర్నలిస్టులు పాల్గొన్నారు.

మిట్టపల్లి రామ్మోహన్ హఠాన్మరణం



హన్మకొండ అర్బన్: నగరంలోని వడ్డేపల్లి ప్రాంతానికి చెందిన మాజీ కార్పొరేటర్, బాలయ్య హోటల్ యజమాని మిట్టపల్లి బాలయ్య కుమారుడు మిట్టపల్లి రామ్మోహన్ గురువారం గుండెపోటుతో ఆకస్మికంగా మృతి చెందారు. రామ్మోహన్ అల్లుడు కిరణ్ ప్రస్తుతం డిప్యూటీ తహసీల్దార్ హోదాలో హనుమకొండ జిల్లా కలెక్టర్ సీసీగా పనిచేస్తున్నారు. ఈమేరకు కలెక్టర్ ప్రావీణ్య బాధిత కుటుంబాన్ని ఓదార్చారు. రామ్మోహన్ మృతదేహాన్ని ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, స్థానిక కార్పొరేటర్ దాస్యం అభినవ్ భాస్కర్, మాజీ కార్పొరేటర్ దాస్యం విజయభాస్కర్, నాయకులు, ప్రజాప్రతినిధులు సందర్శించి నివాళులర్పించారు.

పోలీస్‌స్టేషన్‌లో ఏసీపీ తనిఖీ



రామన్నపేట: వరంగల్ మట్టెవాడ పోలీస్ స్టేషన్‌ను ఏసీపీ నందిరాంనాయక్ గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే బాధితులకు సత్వర న్యాయం చేయాలని సూచించారు. బాధితులతో బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ వారి సమస్యలను పరిష్కరించాలన్నారు. స్టేషన్‌లో చాలా రోజులుగా పెండింగ్ ఉన్న కేసులను ప్రత్యేకంగా పరిశీలించారు. కార్యక్రమంలో మట్టెవాడ ఇన్‌స్పెక్టర్ తుమ్మ గోపి, ఎస్సైలు విఠల్, నవీన్, సాంబన్న, లచ్చయ్య, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వెనక్కి వెళ్లిన నిధులు తీసుకొచ్చాం..



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగరాజు

- వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు

హసన్‌పర్తి: అభివృద్ధి పనులను బీఆర్‌ఎస్ హయాంలో చేపట్టకపోవడంతో వెనక్కి వెళ్లిన స్మార్ట్ సిటీ నిధులను తిరిగి తీసుకొచ్చామని వర్ధన్నపేట ఎమ్మెల్యే కే.ఆర్.నాగరాజు అన్నారు. నగరంలోని 56వ డివిజన్‌లో సుమారు రూ.3.20 కోట్ల వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులతో పాటు రూ.2.20కోట్ల ఖర్చుతో నిర్మించిన బ్రిడ్జిని గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడేతో కలిసి ఎమ్మెల్యే గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం అభివృద్ధి వైపు దృష్టి సారించలేదని విమర్శించారు. నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. జవహర్ కాలనీలో కమ్యూనిటీ అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని చెప్పారు. దేవన్నపేటలో సుమారు రూ.4.60 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు, మురుగునీటి కాల్వల పనులకు శంకుస్థాపన చేస్తానని పేర్కొన్నారు. అనంతరం ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సిరంగి సునీల్‌కుమార్, దివ్యారాణి, మాజీ కార్పొరేటర్ రాజునాయక్, డివిజన్ అధ్యక్షుడు హరిబాబు, గడ్డం శివరాంప్రసాద్, మణీంధర్ నాథ్, సందెల చిన్న, జవహర్‌కాలనీ అధ్యక్షుడు సోమయ్య పాల్గొన్నారు.

వేసవి డిమాండ్‌కు అనుగుణంగా చర్యలు



ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటులో పాల్గొన్న అధికారులు

హన్మకొండ: వేసవి డిమాండ్‌కు అనుగుణంగా విద్యుత్ సరఫరాకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు ఎన్పీడీసీఎల్ హనుమకొండ ఎస్ఈ కె.వెంకటరమణ తెలిపారు. హనుమకొండ న్యూశాయంపేటలోని 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లో 5 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో 8 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే 8 ఎంవీఏ ఉండగా అదనంగా మరో 8 ఎంవీఏ పెట్టడంతో 16 ఎంవీఏ వరకు సబ్‌స్టేషన్ సామర్థ్యం పెరిగిందని తెలిపారు. వేసవిలో ఎంత లోడ్ పెరిగినా దానిని తట్టుకునేలా సబ్‌స్టేషన్‌ను సిద్ధం చేసినట్లు తెలిపారు. వేసవిని దృష్టిలో పెట్టుకొని అవసరమైన ప్రణాళికలకు ఏర్పాట్లు చేసుకోవాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి, ఏడీఈలు మల్లికార్జున్, జానకీ రాంరెడ్డి, దక్షిణ్‌కుమార్, ఏఈ అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రకృతి సంపదను ప్రతిఒక్కరూ కాపాడాలి



మాట్లాడుతున్న డీఎఫ్ఓ కృష్ణమాచార్య

- డీఎఫ్ఓ కృష్ణమాచార్య

హసన్‌పర్తి: భవిష్యత్ తరాల కోసం ప్రకృతి సంపదను కాపాడానికి తక్షణ చర్యలు చేపట్టాలని అటవీశాఖ జిల్లా అధికారి (ఫ్లయింగ్ స్క్వాడ్) పోలోజు కృష్ణమాచార్య అన్నారు. యునైటెడ్ ఫోరం ఫర్ ఎన్విరాన్‌మెంట్ ప్రొటెక్షన్ ఆధ్వర్యాన గురువారం హసన్‌పర్తిలోని సంస్కృతీ విహార్‌లో నిర్వహించిన ఆ సంస్థ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇతర పట్టణాల మాదిరిగానే వరంగల్‌లో కూడా అడవుల శాతం రోజురోజుకూ తగ్గుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. నీటి కాలుష్యం, పట్టణీకరణ ప్రభావాలు వంటి పర్యావరణ సమస్యలను నగరం ఎదుర్కొంటోందన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి వై.వి.గణేష్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. నగరంలోని పర్యావరణ ఉద్యమంలో పాల్గొనడానికి స్వచ్ఛంద సంస్థలు, పాఠశాలలు, కళాశాల విద్యార్థులు పాల్గొని మొక్కలు నాటాలని సూచించారు. అటవీశాఖ రిటైర్డ్ అధికారి కాజీపేట పురుషోత్తం మాట్లాడుతూ చెత్తా వేరు చేయడం, కంపోస్టును ప్రోత్సహించడం ద్వారా డంపు యార్డ్ వ్యర్థాలను తగ్గించవచ్చని సూచించారు. జిల్లా ప్రజల సహకారంతో ఇనుపరాతి గుట్ట అడవిని పరిరక్షించాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశంలో యునైటెడ్ ఫోరం ఎన్విరాన్‌మెంట్ ప్రొటెక్షన్ కార్యవర్గ సభ్యులు పొన్నాల రామ్మోహన్, కె.అనితారెడ్డి, టి.శ్రవణ్‌కుమార్, మండల పరుశరాములు, రాజగోవింద్, వి.సుధాకర్‌స్వామి, నాగేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



వరంగల్ లీగల్: వరంగల్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో త్వరలో నిర్వహించనున్న తెలంగాణ అడ్వకేట్స్ ఇన్విటేషనల్ రాష్ట్రస్థాయి క్రికెట్ టోర్నమెంట్ వాల్‌పోస్టర్లను జిల్లాలో కోర్టు ప్రాంగణంలో వరంగల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి నిర్మలాగీతాంబ గురువారం ఆవిష్కరించారు. వరంగల్ బార్ అసోసియేషన్ బాధ్యులు, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

ఆలయంలో లక్ష నామార్చనలు

కాజీపేట: ధనుర్మాసోత్సవాలను పురస్కరించుకుని కాజీపేట 61వ డివిజన్ చైతన్యపురి కాలనీలోని గోదాదేవి, పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి దేవాలయంలో మహిళలు గురువారం లక్ష్మీ నారాయణుల సామూహిక లక్ష సహస్రనామార్చనలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు రఘురామాచార్యుల ఆధ్వర్యంలో అమ్మవారితో పాటు శ్రీనివాసుడికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు జరిపించారు. ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు పంజాల అశోక్‌కుమార్ గౌడ్, కెప్టెన్ వడ్డెపల్లి నరేందర్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పుష్ప దర్శక, నిర్మాత, హీరోలపై చర్యలు తీసుకోవాలి

హన్మకొండ చౌరస్తా: నేర ప్రవృత్తిని ప్రోత్సహించడం, పోలీసు, రాజకీయ వ్యవస్థలను కించపరిచేలా నిర్మించిన పుష్ప -2 చిత్ర దర్శక, నిర్మాత, హీరోపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని సీనియర్ జర్నలిస్టు కేశవమూర్తి కోరారు. ఈమేరకు వరంగల్ సీపీ అంబర్ కిషోర్‌ఝా, హనుమకొండ ఎస్‌హెచ్ఓ సతీష్‌ను కలిసి ఫిర్యాదు చేశారు.

గంజాయితో పట్టుబడిన ఇద్దరి అరెస్ట్

కాజీపేట: కాజీపేటలో గురువారం సాయంత్రం పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులకు అనుమానస్పదంగా కనిపించిన ఇద్దరు వ్యక్తులను తనిఖీ చేయగా 1.9 కిలోల శుద్ధి చేసిన గంజాయి లభించినట్లు సీఐ సుధాకర్ రెడ్డి తెలిపారు. ఎస్సై నవీన్‌కుమార్ సిబ్బందితో కలిసి వెంకటాద్రినగర్ కాలనీ కి వెళ్తుండగా ఇద్దరు వ్యక్తులు పోలీసులను చూసి పారిపోవడానికి యత్నించారు. వెంటనే అప్రమత్తమైన ఎస్సై వారిని అడ్డుకుని సోదా చేయగా శుద్ధి చేసిన గంజాయి కనిపించింది. పంచుల సమక్షంలో గంజాయిని సీజ్ చేసి జయశంకర్ భూపాలపల్లి జిల్లాకు చెందిన వేముల నిఖిల్, హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం శనిగరం గ్రామానికి చెందిన వట్టెముల నాగరాజును అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వివరించారు.

నిషేధిత గుట్కా పట్టివేత

హన్మకొండ చౌరస్తా: హనుమకొండ పోలీస్ స్టేషన్ పరిధిలోని అలంకార్ ఏరియాలో రూ.50,480 విలువైన నిషేధిత గుట్కా పట్టుకుని విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపారు. విశ్వసనీయమైన సమాచారం మేరకు గురువారం హనుమకొండ పోలీసులతో కలిసి అలంకార్ ప్రాంతంలోని ఎండి. ఇంతియాజ్ ఇంట్లో దాడులు చేయగా అంబర్లు, పాన్‌మసాల గుట్కాలు లభించాయి. దీంతో గుట్కా, అంబర్లను సీజ్ చేయడంతోపాటు నిందితుడు ఇంతియాజ్‌ను హనుమకొండ పోలీసుస్టేషన్‌లో అప్పగించినట్లు ఏసీపీ మధుసూదన్ తెలిపారు.

కళాశాలపై చర్య తీసుకోవాలి

న్యూశాయంపేట: ఏకశిల యాజమాన్యం ఒత్తిడి వల్ల కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న శ్రీదేవి ఆత్మహత్యకు పాల్పడిందని ఏఐఎస్‌బీ రాష్ట్ర కన్వీనర్ హకీమ్‌నవీద్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం నుంచి హాస్టళ్లకు అనుమతులు లేకున్నా అనధికారికంగా, అధికారుల పరోక్ష సహాయ సహకారాలతో ప్రైవేట్ కళాశాలల యజమాన్యాలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయని ఆయన పేర్కొన్నారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు



కాజీపేట: కాజీపేట 61వ డివిజన్ సిద్ధార్థనగర్ కాలనీలోని ఎక్లేసియా ఫుల్ గాస్పెల్ చర్చిలో బుధవారం అర్ధరాత్రి వరకు వేలాది మంది క్రైస్తవులు క్రిస్మస్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. బిషప్ డేనియల్, పాస్టర్ అజుబా కల్యాణపు ఆధ్వర్యంలో జరిగిన వేడుకలకు క్రిస్టియన్లు భారీగా తరలివచ్చారు. గీతాలు, కొరియోగ్రఫీ, కేక్ కటింగ్, క్యాండిల్ లైట్ కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో బిషప్ జాన్ మార్కండేయ, డాక్టర్ కేసీ.జాన్ బన్ని, డాక్టర్ పి.అశోక్ కుమార్, డాక్టర్ నవీన్‌కుమార్‌తో పాటు దైవజనులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

- మాజీ ఎంపీ సీతారాంనాయక్



మాట్లాడుతున్న సీతారాంనాయక్

విద్యారణ్యపురి: సమగ్రశిక్ష ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని మహబూబాబాద్ మాజీ ఎంపీ, బీజేపీ నాయకుడు అజ్మీర సీతారాం నాయక్ డిమాండ్ చేశారు. పేస్కేల్ వర్తింపజేయాలని, రెగ్యులరైజ్ చేయాలని తదితర డిమాండ్లతో సమగ్ర శిక్ష ఉద్యోగులు చేపట్టిన సమ్మె గురువారం 21వ రోజుకు చేరుకుంది. హనుమకొండ, వరంగల్ జిల్లాల ఉద్యోగులు ఏకశిల పార్కు వద్ద చేపట్టిన దీక్షల శిబిరాన్ని సీతారాంనాయక్ సందర్శించి సంఘీభావం తెలిపి మాట్లాడారు. పదేళ్లుగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉండి సమగ్ర శిక్ష ఉద్యోగులను పట్టించుకోలేదని విమర్శించారు. ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం కూడా దృష్టి సారించడం లేదని అన్నారు. సమ్మెకు బీజేపీ మద్దతు, సహకారం ఉంటుందని భరోసా ఇచ్చారు. సమ్మెలో సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం వరంగల్ జిల్లా అధ్యక్షుడు దొనికల శ్రీధర్‌గౌడ్, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ఎండీ షఫీ, ఉద్యోగులు పాల్గొన్నారు.

8న బీసీ విద్యార్థుల సమర శంఖారావం



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సంఘం బాధ్యులు

కేయూ క్యాంపస్: జనవరి 8న హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో జరగబోయే బీసీ విద్యార్థుల సమర శంఖారావాన్ని విజయవంతం చేయాలని బీసీ విద్యార్థి సంఘం కేయూ ఇన్‌చార్జ్ ఆరెగంటి నాగరాజుగౌడ్ పిలుపునిచ్చారు. ఈమేరకు కాకతీయ యూనివర్సిటీలోని పరిపాలన భవనం ఆవరణలో ఉన్న రాణిరుద్రమ విగ్రహం వద్ద సమర శంఖారావం పోస్టర్లను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల త్యాగాలు, బలిదానాలతోనే తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అయిందని గుర్తుచేశారు. గత పదేళ్లలో విద్యార్థులకు అన్యాయం జరిగిందని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు విడుదల చేయడంలో ప్రభుత్వం జాప్యం చేస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ విద్యార్థి సంఘం నాయకులు రాములు, అశోక్, భద్రయ్య, నాగరాజు, బండి నాగరాజు, రాజశేఖర్, కద్రు, సతీష్, మహేందర్, అనిల్, ప్రతాప్, మధు తదితరులు పాల్గొన్నారు.

ఐక్యతతో స్థలాలను సాధించుకున్నాం



సమావేశంలో మాట్లాడుతున్న సాగర్

మామునూరు: అనేక నిర్బంధాలు ఎదుర్కొని, ఐక్యతతో భూ పోరాటాలు చేసి ఇంటి స్థలాలను సాధించుకున్నామని, ఆ స్థలాల్లో వెంటనే స్థిర నివాసం ఏర్పాటు చేసుకోవాలని ప్రజా ఉద్యమ నేత మాలోతు సాగర్ సూచించారు. గుడిసెవాసుల అభ్యర్థన మేరకు వరంగల్ 43వ డివిజన్ తిమ్మాపూర్ శివారు జక్కలొద్దిలో ఏర్పాటు చేసిన గుడిసెలను ఆయన గురువారం సందర్శించారు. అనంతరం జరిగిన సమావేశంలో సాగర్ మాట్లాడుతూ సీపీఎం అండదండలతో బీఆర్‌ఎస్, భూమాఫియా, రౌడీషీటర్ల నిర్బంధాలను ఎదుర్కొని ప్రాణాలకు తెగించి పోరాటం చేసి భూమిని సాధించుకున్నామని గుర్తుచేశారు. పోరాడి సాధించుకున్న భూమిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు. కార్యక్రమంలో గుడిసెల ప్రతినిధులు జీ.ఓదెలు, రామ సందీప్, ప్రత్యూష, జ్యోతి, కోటి, వెంకన్న, శ్యామ్, భరత్, అనిల్, యాకన్న, సంపత్, కళ, స్వప్న, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ బెట్టింగ్ స్థావరంపై టాస్క్‌ఫోర్స్ దాడి

- రూ.2,46,700 నగదు, రెండు స్మార్ట్‌ఫోన్లు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న నగదు, స్మార్ట్ ఫోన్లను చూపుతున్న ఇన్‌స్పెక్టర్ రంజిత్‌కుమార్

ఖిలా వరంగల్: ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ స్థావరంపై టాస్క్‌ఫోర్స్ అధికారులు అకస్మికంగా దాడి చేసి ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకుని రూ. 2,46,700 నగదు, రెండు స్మార్ట్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ వరంగల్ ఏసీపీ మధుసూదన్ తెలిపారు. పడమరకోటలోని ఓ ఇంటిలో తాడెం భరత్(30) ఆన్‌లైన్‌లో 99.కమ్ ద్వారా క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్నట్లు పక్కా సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ రంజిత్‌కుమార్ గురువారం సాయంత్రం ఆకస్మికంగా దాడి చేసినట్లు పేర్కొన్నారు. తదుపరి చర్యలు నిమిత్తం కేసు నమోదు చేసి నిందితుడిని మిల్స్‌కాలనీ పోలీసులకు అప్పగించినట్లు తెలిపారు.

టిప్పర్ ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలు



ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టిన టిప్పర్

మడికొండ: రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలైన సంఘటన మడికొండ చౌరస్తాలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం హసన్‌పర్తి మండలం ముచ్చర్ల నాగారం గ్రామానికి చెందిన బోర్ర రాజేష్ మడికొండకు తన ద్విచక్ర వాహనంపై వచ్చి తిరిగి వెళ్తుండగా మడికొండ చౌరస్తా వద్ద కాజీపేట నుంచి మడికొండ వైపునకు వెళ్తున్న టిప్పర్ ఢీ కొట్టింది. దాంతో రాజేష్ కుడికాలు విరగగా చికిత్స నిమిత్తం 108 వాహనంలో స్థానికులు ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. ఈ సందర్భంగా గ్రామంలోకి భారీ వాహనాలు రాకుండా బారికేడ్లు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. భారీ వాహనాల రాకపోకలతో గతంలోనూ అనేక రోడ్డు ప్రమాదాలు జరిగాయని, ప్రాణాలు సైతం పోయాయని ఆందోళన వ్యక్తం చేశారు.

పోరాట ఘన చరిత్ర సీపీఐ సొంతం

సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి శ్రీనివాస్‌రావు



న్యూశాయంపేట: నినదిస్తున్న నాయకులు

న్యూశాయంపేట: దేశ స్వాతంత్ర్యం కోసం బలిదానాలు చేసి అనేక పోరాటాలు నిర్వహించి, త్యాగాలకు నిలయమైన పార్టీ సీపీఐ మాత్రమేనని రాష్ట్ర సహాయ కార్యదర్శి టి. శ్రీనివాస్‌రావు అన్నారు. పార్టీ శత ఆవిర్భావం సందర్భంగా హనుమకొండలోని పార్టీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో కే.భిక్షపతి, ఎల్లేష్, ఎం.భిక్షపతి, సంతోష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

అంతరాలు లేని సమాజమే ధ్యేయం

ఖిలా వరంగల్: దేశ ప్రజలందరికి స్వతంత్ర ఫలాలు అందించాలని, సీపీఐ సుదీర్ఘ కాలంగా పోరాటాలు నిర్వహిస్తోందని, సమసమాజ స్థాపన కోసం పోరాటం చేస్తోందని శ్రీనివాస్‌రావు అన్నారు. శివనగర్‌లోని సీపీఐ తమ్మెర భవనంలో జిల్లా కార్యదర్శి మేకల రవి, సహాయ కార్యదర్శి షేక్ బాష్‌మియా ఆధ్వర్యంలో పార్టీ వారోత్సవాలను నిర్వహించారు.

పేదల హక్కుల సాధనకు పోరాడుదాం

వరంగల్: పేదల హక్కుల సాధన కోసం ప్రతిఒక్కరూ సిద్ధం కావాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు పిలుపునిచ్చారు. వరంగల్ గాంధీనగర్‌లో సీపీఐ 99వ వార్షికోత్సవం సందర్భంగా జెండా ఆవిష్కరించారు. షేక్ బాషుమియా, పనాస ప్రసాద్, కర్ర భిక్షపతి, బుస్స రవీందర్, దండు లక్ష్మణ్, ఓర్సు రాజు, ఎండి.అక్బర్ పాషా, రమేష్ పాల్గొన్నారు.